ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
బుధవారం 11 డిసెంబరు 2024





పరిగిలో లైట్లు వేసుకొని వస్తున్న ఆర్టీసీ బస్సు

మంచు దుప్పటి



పరిగి పట్టణంలో..

పరిగి పట్టణాన్ని మంగళవారం మంచుదుప్పటి కమ్మేసింది. ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు ఉండడంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు పడ్డారు. ఉదయం వాకింగ్‌కు వెళ్లిన వారంతా ఉన్ని దుస్తులు ధరించాల్సిన పరిస్థితి. కాగా, హెడ్‌లైట్లు వేసుకొనే వాహనాలను నడిపించారు. అలాగే కులకచర్లలోనూ మబ్బులు ఆకాశాన్ని కమ్మేశాయి. ఉదయం 9 గంటల వరకు మంచు, మబ్బు ప్రభావంతో ప్రజలు బయటకు రాలేకపోయారు. పాంబండ దేవాలయంపై మంచు, మబ్బు పూర్తిగా కమ్ముకుంది.

పరిగి/కులకచర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి)



కులకచర్లలో..

310 కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్ష

హాజరు కానున్న 10,381 మంది అభ్యర్థులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలను మొత్తం 310 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. అలాగే పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 15, 16 తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లో చీఫ్ సూపరింటెండెంట్‌లు, రూట్ ఆఫీసర్స్, ఇన్విజిలేటర్లు, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పరీక్షల నిర్వహణకు 310 కేంద్రాలను గుర్తించామన్నారు. వికారాబాద్ రీజినల్ పరిధిలో 19, తాండూరు రీజినల్‌లో 11 పరీక్ష కేంద్రాలలో మొత్తం 10,381 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. వికారాబాద్ మండలంలో 14 పరీక్ష కేంద్రాలు, పూడూరు 1, పరిగి 4 కేంద్రాలు అలాగే తాండూరు మండలంలో 11 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇన్విజిలేటర్లు, శాఖపరమైన అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ విధించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, అదనపు ఎస్పీ టీవీ హన్మంతరావు, ఆర్డీవో వాసుచంద్ర, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రీజినల్ కోఆర్డినేటర్లు డాక్టర్ నరేంద్రకుమార్, అరవింద్ రెడ్డి, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నేమత్ అలీ తదితరులు పాల్గొన్నారు. గ్రూప్-2 పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఉత్తమ స్వచ్ఛ భారత్ జిల్లాగా మార్చాలి

స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ్)లో భాగంగా జిల్లాలో నవంబరు 14 నుంచి డిసెంబరు 10 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. గ్రామ పంచాయతీల్లో గ్రామస్తులకు మరుగుదొడ్ల ఉపయోగం, వినియోగంపై అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా జిల్లాను ఉత్తమ స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లాగా రూపొందించాలని కోరారు.

మేడ్చల్ జిల్లాలో 116 పరీక్ష కేంద్రాలు



మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రూప్ - 2 పరీక్షలకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 116 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లో వివరాలు వెల్లడించారు. ఈ పరీక్షలు రెండు సెషన్‌లు ఉంటాయన్నారు. అభ్యర్థులు 9వ తేదీ నుంచి కమిషన్ వెబ్‌సైట్‌లో హాల్ టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని సూచించారు. అభ్యర్థులు పరీక్షకు కనీసం ఒక రోజు ముందుకు పరీక్షా కేంద్రాన్ని సందర్శించాలని కలెక్టర్ సూచించారు. నిబంధనల మేరకు హాల్ టికెట్‌లో సూచించిన పీడబ్ల్యుడీ అభ్యర్థులకు మాత్రమే గంట సమయం అదనంగా ఇస్తారన్నారు.

ఇంటర్ @ 90 డేస్

ఉత్తమ ఫలితాలకు ప్రత్యేక ప్రణాళిక

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగే విధంగా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించారు. పరీక్షలకు మూడు నెలల సమయం మాత్రమే ఉండడంతో ఇప్పటి నుంచి ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సన్నద్ధం చేసేందుకు '90 రోజుల ప్రణాళిక'ను సిద్ధం చేశారు. ఇప్పటి వరకు ఏ విధంగా విద్యా బోధన జరిగినా ఇప్పటి నుంచి విద్యార్థుల చదువులపై దృష్టి సారించనున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన డీఐఈవోలు, ప్రిన్సిపాళ్ల సమావేశంలో ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. దీంతో అన్ని కళాశాలల్లో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు.

- డిసెంబర్ చివరి వరకు సిలబస్ పూర్తి
- స్టూడెంట్స్‌ను దత్తత తీసుకోనున్న అధ్యాపకులు
- ఒత్తిడికి లోనయ్యే విద్యార్థులకు కౌన్సెలింగ్
- అన్ని కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- తల్లిదండ్రులతో సమావేశాల నిర్వహణ
- ప్రతీనెలా విద్యాశాఖకు డీఐఈవోల నివేదిక



వికారాబాద్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు



వికారాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ కళాశాల్లో ఇంటర్ ఫలితాలపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఏ విధంగా ముందుకు సాగాలనే విషయమై ఇంటర్ విద్యా శాఖ డైరెక్టర్ డీఐఈవోలు, ప్రిన్సిపాళ్లకు ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. ఇందుకోసం 90 రోజుల ప్రణాళికను ప్రకటించారు. ఇందులో భాగంగా విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోనున్నారు. గైర్హాజరవుతున్న విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కళాశాలకు పిలిపించి మాట్లాడనున్నారు. పిలిచినా రాకపోతే వారి పేర్లను తొలగించనున్నట్లు సమాచారం. ప్రతి విద్యార్థి స్థాయిని అంచనా వేసి, వెనకబడిన వారిని గుర్తించి వారి చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నారు. ఏ సబ్జెక్టుల్లో

మిగతా 8వ పేజీలో...

జిల్లాలో జూనియర్ కాలేజీలు	
ప్రభుత్వ 13	బీసీ సంక్షేమ 10
కేజీబీవీ 10	సాంఘిక సంక్షేమ 06
మోడల్ 09	గిరిజన సంక్షేమ 06
మైనార్టీ గురుకుల 06	టీఎస్ఆర్‌జేసీ 02
ప్రైవేట్, ఎయిడెడ్ 15	మొత్తం 77

విద్యార్థుల సంఖ్య
మొదటి సంవత్సరం 5,571
రెండో సంవత్సరం 7,607
మొత్తం 13,178

90 రోజుల ప్రణాళిక అమలుకు చర్యలు

ప్రతి 15 రోజులకు ఒకసారి కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, వారి స్థాయిని వివరించనున్నారు. పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు రూపొందించిన '90 రోజుల ప్రణాళిక' పకడ్బందీగా అమలయ్యేలా సహకరించాలని తల్లిదండ్రులను కోరనున్నారు. డిసెంబరు చివరి వరకు సిలబస్ పూర్తిచేసే విధంగా చర్యలు చేపడుతున్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులను అధ్యాపకులు దత్తత తీసుకుని వారి పురోగతిపై దృష్టి సారించనున్నారు. నోడల్ అధికారి ప్రతి కళాశాలను తనిఖీ చేసి విద్యార్థుల చదువులు ఎలా కొనసాగుతున్నాయనేది పరిశీలించనున్నారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడే అంశాలపై ప్రిన్సిపాల్, అధ్యాపకులకు తగిన సూచనలు ఇవ్వనున్నారు. తరగతి గదిలో విద్యార్థులకు ఎదురయ్యే ఇబ్బందులు, సమస్యలను తెలుసుకుని వాటిని అధిగమించేలా చర్యలు చేపట్టనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే కాకుండా ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్, గురుకుల, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో కూడా నిత్యం సమీక్షించనున్నారు. ప్రతీనెలా తమ క్షేత్రస్థాయి పర్యటనలకు సంబంధించి డీఐఈవోలు ఇంటర్ విద్యాశాఖ ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాల్సి ఉంటుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకున్నా.. లేనిచోట్ల కనీసం నాలుగు సీసీ కెమెరాలైనా అమర్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.



కూరగాయలు @బాబాగూడ
పంటల సాగులో ఆదర్శంగా నిలుస్తున్న రైతులు
తీగజాతి కూరగాయలతో పాటు ఇతర పంటల సాగు
7



మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడాలి
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డీబీ శీతల్
7



నిధుల లేమితో నిర్వహణ భారం
రైతు వేదికల్లో కనీస సౌకర్యాలు కరువు
8

4,982 పోలింగ్ కేంద్రాల గుర్తింపు

- అదనపు కలెక్టర్ సుధీర్
- పంచాయతీ ఎన్నికలపై పార్టీల ప్రతినిధులతో సమావేశం

వికారాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలలో ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 4,982 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. ఈ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల అంశంపై మంగళవారం జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 585 గ్రామ పంచాయతీల్లోని 4,982 వార్డులకు గాను, 4,982 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. వీటిలో 200 లోపల ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు 4,129 ఉన్నాయని, 201-400 మధ్య ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు 796 ఉన్నాయని, 401-650 పైన ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు 57 ఉన్నాయని తెలిపారు. కేంద్రాల విషయంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాల్సిందిగా పార్టీల ప్రతినిధులకు సూచించారు. తదుపరి డిసెంబర్ 12వ తేదీన ఎంపీడీవోల ఆధ్వర్యంలో మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు: డీడీఎంహెచ్‌వో

- నలుగురు వైద్య సిబ్బందికి మెమోలు

దోమ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజ్ హెచ్చరించారు. మంగళవారం దోమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు సిబ్బందికి మెమోలు జారీ చేశారు. ఈ నెల 7న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆసుపత్రిని తనిఖీ చేసిన సమయంలో విధుల్లో లేని ఇద్దరు ఏఎన్ఎంలు, ఇద్దరు అటెండర్లకు మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో సిబ్బంది ఎల్లవేళల అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వైద్యురాలు రజిత, సిబ్బంది ప్రభాకర్, వెంకటేశ్ ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

పారదర్శకంగా లబ్ధిదారుల సర్వే చేయాలి

- ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్‌పై అవగాహన

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):మున్సిపాల్టీల్లో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాధికా గుప్తా సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్‌పై మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ వార్డు అధికారులకు మంగళవారం కలెక్టరేట్‌లో అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒత్తిడిలకు లొంగకుండా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని తెలిపారు. సమావేశంలో నోడల్ ఆఫీసర్ వై.శ్రీనివాసమూర్తి, హౌజింగ్ డీఈఈలు భగవంత్‌రావు, అశోక్‌కుమార్, ఏఈలు అల్లాజి, సుభాష్‌రెడ్డి, హౌజింగ్ కోఆర్డినేటర్ ప్రవీణ్, ఈడీఎం భానుప్రకాష్, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకసభ్య కమిషన్‌కు వినతులు



వినతులను స్వీకరిస్తున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య విచారణ కమిషన్ ఛైర్మన్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ షమీమ్ అక్తర్ మంగళవారం రంగారెడ్డి జిల్లాలో పర్యటించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ వర్గీకరణపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో బహిరంగ విచారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దళిత సంఘాల నాయకులు వినతి పత్రాలను అందజేశారు. మాలలు, మాదిగలు, జంగాలు, చిందులు, బేడ బుడగ జంగాలు, బైండ్ల మంగులతో పాటు వివిధ వర్గాల ప్రతినిధులు డాక్టర్ అక్తర్‌కు వినతులను అందజేశారు. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. వర్గాల సామాజిక-ఆర్థిక వెనుకబాటు కారణంగా విద్య మరియు ఉద్యోగాలకు రిజర్వేషన్లు పొందడంలో ఎదుర్కొంటున్న అన్యాయాల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేక అధ్యయనం కోసం ప్రతిపాదనలు, వినతులు కీలకమన్నారు. న్యాయపరమైన అంశాలు, సామాజిక పరిస్థితులను పరిశీలించేందుకు ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, జిల్లా సోషల్ వెల్ఫేర్‌అధికారి రామరావ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏకసభ్య కమిషన్ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించిన అక్కడి వారితో మాట్లాడి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

తెలంగాణ తల్లి విగ్రహంపై రాజకీయాలు సరికాదు

ఆమనగల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని రాజకీయం చేయడం తగదని తెలంగాణ రాష్ట్ర చిత్రకారుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రూపం వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం అస్తిత్వం ఉట్టిపడేలా బహుజనుల తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపకర్తలు ప్రొఫెసర్ గంగాధర్, ఎంవీ రమణారెడ్డిలు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో చేపట్టినట్లు చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూస్తే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల గుండె చప్పుడుగా ఉందన్నారు. ప్రతీ ఇంట్లో కన్నతల్లిని చూసిన భావన కలుగుతుందన్నారు. తెలంగాణ తల్లిని అగౌరవ పరచడం సరైంది కాదన్నారు. చిత్రకారుల సంఘం నాయకులు కళా లింగం, శ్రీనివాస్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి హెచ్చరించారు. ఈమేరకు ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ధరణి అప్లికేషన్లు, ల్యాండ్ అక్విజిషన్, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు నిరంతరం కృషిచేయాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కీసర ఆర్డీవో సైదులు, తహసీల్దార్ డీఎస్ రజినీ, డీటీ రాజేందర్, ఆర్‌ఐలు సాయిరామ్, కావ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మొలకెత్తిన ధాన్యం.. ఆందోళనలో రైతులు

- వానకు తడిసి పాడైన వడ్లు
- ప్రభుత్వం కొనాలని వేడుకోలు

యాచారం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మూడు రోజుల క్రితం మోస్తరు వర్షం కురియడంతో ధాన్యం తడిసి మొలకెత్తింది. వానకాలం వడ్లను రైతులు రోడ్లపై ఎండబోసి రాత్రిపూట ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పుతున్నారు. అయితే, వానకు వడ్ల రాసుల కింద నీరుచేరి ధాన్యం తడిసి మొలకెత్తింది. మంగళవారం ఉదయం ఎండకు నేర్పుతున్న సమయంలో మొలకెత్తిన ధాన్యాన్ని చూసి రైతులు ఖిన్నులయ్యారు. కొన్నిరోజులుగా ఆకాశం మేఘావృతం కావడంతో కుప్పలు నేర్పలేదని, వాటి కిందికి నీరు చేసి వడ్లు మొలకెత్తాయని నజ్దిక్‌సింగారానికి చెందిన రైతులు యాదమ్మ, మల్లేష్ కన్నీటి పర్యంతమయ్యారు. మొలకెత్తిన ధాన్యాన్ని పడేసేందుకు మనసు రావడం లేదని, మొలకెత్తిన ధాన్యాన్ని అధికారులే కొని తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



రోడ్డు పక్కన మొలకెత్తిన వడ్లు

పోరాట యోధుడు పండుగ సాయన్న



తలకొండపల్లి : సాయన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



పరిగి : నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, నాయకులు

కొడంగల్‌రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పెత్తందారీ వ్యవస్థపై రాజీలేని పోరాటం చేసిన యోధుడు పండుగ సాయన్న అని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూర వెంకటయ్య ముదిరాజ్ అన్నారు. పండుగ సాయన్న వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం కొడంగల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు కూర వెంకటయ్య తలారి శేఖర్, కాశప్ప, రాములు, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిగి: తెలంగాణ రాబిన్‌ఉడ్ పండుగల సాయన్న 134వ వర్ధంతిని మంగళవారం పరిగిలో ఘనంగా నిర్వహించారు. పరిగిలోని పండుగల సాయన్న విగ్రహానికి పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ పార్టీలు, ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, ఏఎంసీ చైర్మన్లు ఆంజనేయులు, సురేందర్, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, మాణిక్యం, సత్యనారాయణ, రాంచంద్రయ్య, నాగేశ్వర్, డి.కృష్ణ, బందెయ్య పాల్గొన్నారు.

తలకొండపల్లి : పండుగ సాయన్న ఆశయ సాధనకు ముదిరాజ్‌లు కృషి చేయాలని మత్స్యకారుల సంఘం మండలాధ్యక్షుడు బోళ్ల యాదగిరి ముదిరాజ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు బాలయ్యలు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సాయన్న వర్ధంతిని నిర్వహించారు. మత్స్యకారులు పెద్దసంఖ్యలో పాల్గొని సాయన్న చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు పుట్ట పాండు, పద్మ అనిల్, బక్కి కుమార్, తదితరులున్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో సాయన్న వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. పీసీసీ కిసాన్‌సెల్ కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ అజీం, డీసీసీ కార్యదర్శి రవీందర్ యాదవ్, నాయకులు డిగ్రీ కృష్ణ, ఆరిఫ్, చెన్నకేశవులు, రమేశ్, నూకం శేఖర్, రమేశ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కాలేజీ యాజమాన్యంతో మాట్లాడుతున్న రాథోడ్ సంతోష్

ఆల్‌ఫోర్స్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఆల్‌ఫోర్స్ విద్యాసంస్థ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. కళాశాల యాజమాన్యం తీరుపై ఆయన మంగళవారం కాలేజీ వద్ద ఆందోళన చేపట్టి కొద్దిసేపు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుషాపూర్‌లోని ఆల్‌ఫోర్స్ ఇంటర్ కళాశాలలో విద్యార్థులు గొడవపడి ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా నేరుగా పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి భయభ్రాంతులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమన్నారు. చదువుకునే పిల్లలు చిన్న చిన్న పొరపాట్లు చేస్తే తల్లిదండ్రులను పిలిచించి కౌన్సిలింగ్ ఇప్పించి సరిదిద్దాల్సిన అధ్యాపకులు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లడం ఏంటని ప్రశ్నించారు. ఫీజుల విషయంలో ఉన్న శ్రద్ధ పిల్లలకు చదువు చెప్పడంలో లేదన్నారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న కళాశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అనిల్, శివ, కిశోర్, విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యసేవలను వినియోగించుకోవాలి



ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పులుమామిడి గ్రామంలో పల్లె దవాఖాన నూతన ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఎంపీడీవో అనురాధ, మాజీ సర్పంచ్‌లు వెంకటయ్య, భీమ్‌రెడ్డి, ఉప సర్పంచ్‌లు నర్సిములు, యాదగిరి, సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాథోడ్ గీతాసింగ్, పీఏసీఎస్ చైర్మన్ రామ్‌రెడ్డి, నాయకులు కందాడ నాగిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ఇబ్రహీం, శ్రీనివాస్, అమీర్ జానీ, గోపాల్‌రెడ్డి, వైద్యాధికారి రోహిత్ పాల్గొన్నారు.

గుట్కా విక్రయాలు చేపట్టొద్దు

ఆమనగల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గుట్కా వంటి పదార్థాల క్రయ విక్రయాలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ బ్రిప్రమోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆమనగల్లులో విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్రవాహనాలు నడుపుతున్న వారిని చేరదీసి విధిగా హెల్మెట్ ధరించాలని లేకపోతే ప్రాణాలకే ముప్పు ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. డ్రైవింగ్ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాలను తనిఖీ చేసి గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై మద్యం కేసులు, ఒకరిపై గుట్కా విక్రయం కేసు, బహిరంగంగా మద్యం తాగుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేశారు. పత్రాలు లేని పది వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఆమనగల్లు, కేశంపేట, తలకొండపల్లి, కడ్తాల్ ఎస్సైలు వెంకటేష్, శ్రీకాంత్, నరహరి, వరప్రసాద్, రాజ్‌కుమార్ మరో నలుగురు ట్రైనీ ఎస్సైలు పాల్గొన్నారు.



కిరాణ షాపును తనిఖీ చేస్తున్న పోలీసులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బీసీ సంఘాల నేతల ధర్నా



బీసీ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ

బీసీ సంఘాల ఆధ్వర్యంలో సబ్ కలెక్టరేట్ ముట్టడి

తాండూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీసీ సంఘం ఆధ్వర్యంలో తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బీసీ సంఘాల నేతలు తాండూరు పీపుల్స్ డిగ్రీ కాలేజ్ నుంచి బయలుదేరి శివాజీ చౌక్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లారు. కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని నినాదాలు చేశారు. విడుదల చేయక పోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మూడేళ్లుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ చెల్లించక పోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు సయ్యద్ సుకూర్, జిల్లా అధ్యక్షులు గడ్డం వెంకటేశ్, మండలాల అధ్యక్షులు శ్రావణ్, బసంత్, నరేందర్, విద్యావంతుల వేదిక ప్రతినిధి పర్యాద రామకృష్ణ, బీసీ మహిళ సంఘం ప్రతినిధులు విజయలక్ష్మీ, మంజుల, అనిత, నర్సమ్మ, యువ నాయకులు రాము, గిరిజాపూర్ రమేష్, మంతటి రాజు, తాండూరు నరేష్, శివకుమార్, పాల్గొన్నారు.

తాండూరు సీసీఐలో సమస్యలు పరిష్కరించాలి

కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రికి ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి విన్నపం

తాండూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తాండూరు సీసీఐలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కోరారు. ఈమేరకు మంగళవారం ఎంపీ కుమారస్వామిని ఢిల్లీలో కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు ఎంపీ తెలిపారు. సీసీఐ కర్మాగారంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతోపాటు గణనీయంగా పడిపోయిన ఉత్పత్తులను తిరిగి పెంచేందుకు కృషి చేయాలని కోరారు. కార్మికుల కుటుంబాల కోసం తాండూరు ప్రాంతంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. సీసీఐని బలోపేతం చేయాలని కోరాగా.. సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు.

15న కులకచర్ల మండలంలో మంత్రుల పర్యటన



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కులకచర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 15న రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క కులకచర్ల మండలంలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈమేరకు మంగళవారం కులకచర్లలో సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్‌లు విలేకరులతో మాట్లాడారు. నూతనంగా నియామకమైన మార్కెట్ కమిటీ, పాంబండ దేవాలయ పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రులతో పాటు దేవాలయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో పాటు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. అదేవిధంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో వారు పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. సమావేశంలో నాయకులు మైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు



గుండాలలో నిర్మించిన గోడను జేసీబీ సాయంతో కూల్చివేయిస్తున్న అధికారులు

చేవెళ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కృష్ణయ్య హెచ్చరించారు. చేవెళ్ల మండల పరిధిలోని గుండాలలో గల సర్వేనెంబర్ 153లోని ప్రభుత్వ భూమి మొత్తం ఎకరా గుంట ఉంది. ఇందులో కొంత భూమిని పల్లె ప్రకృతివనం కొరకు కేటాయించారు. మిగిలిన ప్రభుత్వ భూమిని పక్కనే ఉన్న మరో సర్వే నెంబర్ 154లో ఉన్న పట్టాదారుడు దాన్ శ్రీనివాస్ కుమార్ రాజా అనే వ్యక్తి ప్రభుత్వ భూమిలోని 15 గుంటల భూమిని ఆక్రమించాడు. ఇటీవల సర్వే చేయగా ఆక్రమణకు గురైనట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. మంగళవారం తహసీల్దార్ కృష్ణయ్య ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందితో కలిసి భూమిని ఆక్రమించుకోవడమే కాకుండా.. భూమి చుట్టూ ప్రహరీ నిర్మించడంతో జేసీబీ సాయంతో కూల్చివేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎక్కడైనా భూములు ఆక్రమణకు గురైతే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చూచిరాత పోటీలు

జ్ఞానవాహిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ



విద్యార్థులకు పరీక్షా పత్రాలు అందిస్తున్న సభ్యులు

ఆమనగల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వాసవి కల్యాణ మండపంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చూచిరాత పోటీలు నిర్వహించారు. జ్ఞానవాహిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాలకు చెందిన 500 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీవిద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు జూలూరి రవీంద్రానంద్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి సత్యం, ఫౌండర్ రంగారావు, జీహెచ్‌ఎం రామనాథంలతో కలిసి ఎంఈవో పాండు పోటీలను ప్రారంభించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు తరగతులవారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు బికుమాండ్ల నర్సింహ, డాక్టర్ బికుమాండ్ల శ్రీనివాస్, యాదగిరి, టీచర్లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో ఎంతో మేలు



వినతిపత్రం ఇస్తున్న ఆనంద్ మాదిగ

వికారాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణతో ఎంతో మేలు జరుగుతుందని, మాదిగ, మాదిగ ఉప కులాలకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ప్రతిఫలాలు అందినప్పుడే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ముందుకు అవకాశం ఏర్పడుతుందని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాదిగ అన్నారు. ఈమేరకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీం అక్తర్‌కు ఆయన మంగళవారం మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్, నాయకులు ప్రకాష్, సుభాష్, మహేందర్, నర్సిములు, జగదీష్, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వినతి

నవాబుపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఏకసభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్‌ను మంగళవారం కలిసి మాలల స్పష్టమైన అభిప్రాయాన్ని తెలియజేశారు. ఈమేరకు వినతిపత్రం అందజేసినట్లు మాలమహానాడు సంఘం నాయకులు తెలిపారు. నవాబుపేట మండల మాల మహానాడు సంఘం నాయకులు ఆనందం, శివరాజ్, రత్నం, శ్యామ్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు రవీందర్, చంద్రశేఖర్, కృష్ణ, శిలింగం, సుధాకర్, నర్సిములు, ఎక్‌మామిడి మాజీ సర్పంచ్ దేవయ్య తదితరులు ఉన్నారు.

కూరగాయలు @ బాబాగూడ



కాకరకాయల సాగు ఇలా.. ఇన్‌సెట్లో విరివిగా కాసిన కాయలు

- పంటల సాగులో ఆదర్శంగా నిలుస్తున్న రైతులు
- తీగజాతి కూరగాయలతో పాటు ఇతర పంటల సాగు

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : బాబాగూడ.. ఈ పేరు వింటేనే కూరగాయల పంటలు గుర్తుకు వస్తాయి. కూరగాయలు పండించడంలో అంతగా ప్రఖ్యాతి గాంచింది శామీర్‌పేట గ్రామానికి అనుబంధ గ్రామమైన బాబాగూడ. శామీర్‌పేట రాజీవ్ రహదారికి అతి చేరువలో ఉన్న బాబాగూడ గ్రామ రైతులు కూరగాయలు పండించడంలో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. నగరంలోని పలు మార్కెట్లలో బాబాగూడ కూరగాయలంటే వేరే ఏం ఆలోచించకుండా దించేసుకుంటారు. ముఖ్యంగా తీగజాతి, ఇతర కూరగాయల పంటల సాగులో బాబాగూడ రైతులు ఇతరులకు ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలుస్తున్నారు. శామీర్‌పేట మండల పరిధిలో బాబాగూడ ఓ చిన్న గ్రామం. దాదాపు 180 మంది రైతులుండగా.. వీరిలో 150 మందికి సొంత పట్టా కలిగిన భూములున్నాయి. ఒక్కో రైతుకు మూడు నుంచి పదెకరాల మేర భూములున్నాయి. 150 మంది రైతుల్లో 120 మంది యువరైతులే కావడం గమనార్హం. గ్రామంలో కాకర, సోర, బీర, దొండ, పొట్ల వంటి తీగజాతి పందిరి కూరగాయలను పండించడంలో ప్రసిద్ధి గాంచారు. ఏడాది పొడవునా రైతులు తీగజాతి కూరగాయలను పండిస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు. ఈ సంవత్సరం బాబాగూడ పరిధిలో ప్రస్తుతం 300 ఎకరాల విస్తీర్ణంలో 130 మంది రైతులు కాకరగాయలను పందిరి వేసిపండిస్తూ లాభాలను గడిస్తూ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారు. కాగా, 30 మంది వరకు రైతులు ఇతర కూరగాయలైన బీర, పొట్ల, బెండ, టమాటాలను పండిస్తూ లాభాలను గడిస్తున్నారు. బాబాగూడ ప్రాంతానికి వ్యవసాయ సాగుకు సరిపడా నీటి వనరులు లేకున్నప్పటికీ బోరు బావులతో కూరగాయల పండిస్తున్నారు. అప్పుడప్పుడూ నష్టాలను చవిచూస్తున్నప్పటికీ సాగుపై మక్కువ తగ్గడం లేదు. అప్పులు ఎక్కువై ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులకు వీరు విరుద్ధం. యువ రైతులు డిగ్రీ వరకు చదువుకున్నప్పటికీ వ్యవసాయంపైనే మక్కువతో కూరగాయలు పండిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. బాబాగూడ గ్రామానికి చేరుకోగానే రోడ్డుకిరువైపులా ఎక్కడ చూసినా కూరగాయల పందిర్లే కనిపిస్తుంటాయి. ఈ గ్రామ రైతులు ఉదయం లేచింది మొదలు సాయంత్రం వరకు కూరగాయల తోటల్లోనే గడుపుతుంటారు. కోసిన పంటను రైతులే స్వయంగా తెల్లవారుజామున మెదక్ జిల్లాలోని ఒంటిమామిడి, నగరంలోని బోయిన్‌పల్లి, అల్వాల్ తదితర మార్కెట్లకు సరఫరా చేస్తారు. ఈ గ్రామానికి చెందిన పలువురు రైతులు ఉత్తమ రైతు అవార్డులను కూడా అందుకున్నారు. యువకులు, విద్యార్థులు కూడా ఖాళీ సమయాల్లో తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటూ కూరగాయల తోటల్లోనే పనిచేస్తుంటారు. గ్రామంలో ఎక్కడ చూసినా పచ్చని వాతావరణమే కనిపిస్తుంది. ఉన్న కొద్దిపాటి భూమిలో రెండు, మూడు రకాల కూరగాయల పంటలను సాగు చేస్తూ సంవత్సరం పొడవునా పని ఉండేలా సీజన్‌ను బట్టి కూరగాయలను పండిస్తుంటారు. పది ఎకరాలకు పైబడిన వారు ఆధునిక పద్ధతిలో కూరగాయలను సాగుచేస్తున్నారు. వ్యవసాయ క్షేత్రంలోనే పెద్ద బావులను తవ్వించి డ్రిప్ సిస్టమ్ ద్వారా నీటితో పాటు పంటకు ఎరువులను కూడా అందిస్తున్నారు. కరివేపాకు తోటలు కూడా ఎక్కువ మొత్తంలో పండిస్తున్నారు.



తరలించేందుకు సిద్ధంగా ఉన్న కాకరకాయలు

నీటి సంపుల నిర్మాణానికి సబ్సిడీ ఇవ్వాలి



పంటలకు నీరు పెట్టేందుకు రైతులు సొంతంగా ఏర్పాటు చేసుకుంటున్న నీటి సంపులకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలి. నీటి సంపు నిర్మాణానికి రూ.2లక్షల 80వేల ఖర్చు అవుతుంది. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ అందిస్తే రైతులకు భారం తగ్గుతుంది. తోటల్లో కూలీల క్వార్టర్స్ ఏర్పాటుకు, నీటి సంపునకు సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించాలి. నగరం దగ్గరగా ఉండటంతో కూరగాయాలు ఎక్కువగా తరలిస్తుంటాం.

- కందాడి పద్మారెడ్డి, రైతు, బాబాగూడ

కూలీల కొరత ఉంది



కూరగాయ తోటల్లో పనిచేసేందుకు నిత్యం కూలీలు అవసరమవుతారు. ప్రస్తుతం వారి కొరత ఉంది. దాంతో కూరగాయల సాగును కూడా తగ్గించాం. రైతులు కూడా మునుపటిలా పనులు చేయలేకపోతున్నారు. గత 25 ఏళ్ల నుంచి కూరగాయ పంటలనే సాగు చేస్తున్నాం. ఖర్చు కూడా రోజురోజుకూ పెరిగిపోతోంది. లాభాలు ఎక్కువగా ఉండటం లేదు. ఒక్కోసారి కూరగాయలు పడేయాల్సి వస్తుంది. ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించాలి.

- కందాడి సురేందర్‌రెడ్డి, రైతు

నర్సింగ్ కళాశాల వద్ద యువకుడి హల్‌చల్

- మద్యం సేవించి కాలేజీ లోపలికి ప్రవేశం
- భయాందోళనకు గురైన విద్యార్థినులు



తాండూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలోని ప్రభుత్వ ఏఆర్టీ సెంటర్‌పైన కొనసాగుతున్న నర్సింగ్ కళాశాల వద్ద మద్యం సేవించిన ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. దాంతో విద్యార్థినులు భయాందోళనకు గురయ్యారు. తాండూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి ఏఆర్టీ సెంటర్‌లో సెక్యూరిటీ గార్డు లేకపోవడంతో గుర్తుతెలియని యువకుడు పూటుగా మద్యం సేవించి నేరుగా పైఅంతస్తులో కొనసాగుతున్న నర్సింగ్ కళాశాల వద్దకు వెళ్లాడు. అంతకుముందు కాలేజీ గేటు తాళాలను పగులగొట్టి లోనికి వెళ్లాడు. అప్రమత్తమైన ప్రిన్సిపాల్ విజయరాణి పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు.

వికారాబాద్‌లో రేపు జాబ్‌మేళా

వికారాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జొమాటో సంస్థలో ఉద్యోగాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి షేక్ అబ్దుస్ సుభాన్ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో రేపు(గురువారం) ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జొమాటోలో సుమారు 50 డెలివరీ భాగస్వామి పోస్టులున్నాయని, 18 ఏళ్ల పైబడిన వారు అర్హులని తెలిపారు. ఈ ఉద్యోగానికి స్మార్ట్‌ఫోన్ తప్పనిసరి. విద్యార్హత అవసరం లేదని పేర్కొన్నారు. ఈ ఉద్యోగాలు హైదరాబాద్‌లో ఉంటాయని తెలిపారు. వివరాలకు నిర్వాహకుడు మియాసాబ్ సెల్‌నెంబర్ 96760-47444 సంప్రదించాలన్నారు.

మహిళల్లో చైతన్యం తెచ్చింది టీడీపీయే

యాలాల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళల్లో చైతన్యం తెచ్చి, మహిళా సంఘాలుగా ఏర్పాటు చేసింది టీడీపీయేనని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, షాద్‌నగర్ మాజీ టీడీపీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. మంగళవారం దేవనూరు మాజీ ఎంపీటీసీ కోస్గి వెంకటయ్యగౌడ్ తన అనుచరులతో మాజీ ఎమ్మెల్యే బక్కని ఆధ్వర్యంలో యాలాలలో టీడీపీలోచేరారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ మహిళల్లో చైతన్యం తెచ్చి వారిని అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేలా చేశారని అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు తెలంగాణలో మహిళలతో పాటు అన్నివర్గాలకు ఎంతో మేలు చేశారని చెప్పారు. తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తెస్తామన్నారు. దేవనూరు గ్రామానికి చెందిన వెంకటయ్యగౌడ్ టీడీపీలో చేరడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్ గౌడ్, రాఘవులు, జావిద్, కాశప్ప, వెంకటయ్యగౌడ్, దేవనూరు, గోరేపల్లి వాసులు పాల్గొన్నారు.



బక్కని ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతున్న దేవనూరు, గోరేపల్లివాసులు

టీడీపీ ఆవిర్భావంతో తెలుగు జాతికి గుర్తింపు

కడ్తాల్ : సభ్యత్వ నమోదులో టీడీపీ దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు ఆదర్శంగా నిలుస్తుందని టీడీపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యుడు, సీనియర్ న్యాయవాది అండేకార్ యాదిలాల్ అన్నారు. రాష్ట్రంలో టీడీపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ప్రారంభించారు. డిజిటల్ సభ్యత్వాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు ప్రేమ్ రాజ్ కు అందజేశారు. నాయకులు ప్రేమ్‌రాజ్, శివయ్య, కాలె శివ, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

మంచాల : బడుగు, బలహీన వర్గాల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కిందని ఆ పార్టీ ఇబ్రహీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి సీహెచ్ చక్రపాణి అన్నారు. మంచాల మండలం చీదేడ్‌లో టీడీపీ సభ్యత్వ నమోదును మంగళవారం ప్రారంభించారు. రాష్ట్ర నేతలు వంగాల కృష్ణ, కె.వెంకట్‌రెడ్డి, మోర యాదయ్య, మంగళారం శంకర్, ఏ.మల్లారెడ్డి, బుస్సు శంకర్, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

చౌదరిగూడ, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యమైందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య అన్నారు. మంగళవారం ఉమ్మడి టీఎస్‌యూటీఎఫ్ కొందుర్గు మండల మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయ నియామకాలు, ఉద్యోగ బదిలీలు, ప్రమోషన్ల విషయంలో ఎలాంటి పురోగతి కనిపించలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పాఠశాల, ఉన్నత విద్యారంగం కాస్త మెరుగుపడిందన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీలు

టీఎస్‌యూటీఎఫ్ ఉమ్మడి కొందుర్గు మండల నూతన కమిటీలను ఉపాధ్యాయుడు ప్రేమ్‌సాగర్ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొందుర్గు మండలాధ్యక్షుడిగా శివారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా హతిరామ్, జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షురాలిగా నీలా మోహన్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు శేఖర్‌గౌడ్, రాజయ్య, తేజస్విని, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్: మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది డీబీ శీతల్



చౌదరిగూడ: డీటీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడాలి

వికారాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ న్యాయవాది డీబీ శీతల్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ భృంగీ ఇంటర్నేషనల్ పాఠశాలలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శీతల్ పాల్గొని మాట్లాడుతూ బాల్యవివాహాల ప్రభావం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అవసరమని అన్నారు. చిన్నప్పుడే వివాహాలు చేయడం వల్ల జీవితాలు నాశనమవుతాయని, అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో భృంగీ విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి డాక్టర్ ఎ.చంద్రశేఖర్, న్యాయ సేవాధికార సంస్థ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ టి. వెంకటేశ్, డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది మాధవరెడ్డి, కొడంగల్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ చంద్రప్రియ, డైరెక్టర్ కుమారస్వామి, ప్రిన్సిపాల్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులను కాపాడుకుందాం

చౌదరిగూడ: మానవ హక్కులను కాపాడుకుందామని తెలంగాణ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి వెంకటేశ్వరమ్మ అన్నారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవసాయ అనుబంధ కార్మికులచే ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో హక్కులను కల్పించిందని.. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీతహసీల్దార్ భాస్కర్‌కు అందజేశారు. యూనియన్ నాయకులు శ్రీనివాస్, అశోక్, మంగమ్మ, రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి



మాట్లాడుతున్న మెప్మా పీడీ రవికుమార్

పరిగి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా రాణించాలని మెప్మా పీడీ రవికుమార్, పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్యలు కోరారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో మంగళవారం పరిగిలోని అంబేడ్కర్ భవన్‌లో మహిళా సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాల్లోని సభ్యులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. తీసుకున్న రుణాలను గడువులోపు చెల్లిస్తే.. రెట్టింపు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో టీఎంసీ వెంకటేశ్, సీఈవో భాగ్యలక్ష్మి, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

కురుమలు సంఘటితం కావాలి



షాబాద్: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

షాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కురుమలు సంఘటితం కావాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ, కురుమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాపోల్ నర్సింహులు అన్నారు. ఈ నెల 14న కోకాపేటలో నూతనంగా నిర్మించిన కురుమ సంఘం భవనం ప్రారంభోత్సవానికి భారీ సంఖ్యలో కురుమలు తరలిరావాలని కోరారు. ఈమేరకు మంగళవారం షాబాద్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాదయ్య, మండలాధ్యక్షుడు మద్దూరి పాండు, ఉపాధ్యక్షుడు నారాయణ, నాయకులు తదితరులున్నారు.

మేడ్చల్ టౌన్: దొడ్డి కొమురయ్య పేరిట ఈ నెల 14న ప్రారంభిస్తున్న కురుమల ఆత్మ గౌరవ భవనం ప్రారంభోత్సవానికి కురుమ సంఘం నాయకులు పెద్దఎత్తున తరలి రావాలని మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్ కౌడె మహేష్ కురుమ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని కురుమసంఘం కార్యాలయంలో కురుమ భవన ప్రారంభోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలి

కులకచర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలని సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని అంతారం గ్రామస్థులతో మాట్లాడారు. అక్టోబరు 21న గ్రామంలో రెండు వర్గాలు గొడవపడటంతో పలువురు గాయపడిన సంఘటన విదితమే. ఈ నేపథ్యంలో రెండు వర్గాల ప్రజలతో సీఐ మాట్లాడారు. రాజీమార్గమే రాజమార్గంగా సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. గొడవలు పడి కోర్టుల చుట్టూ తిరిగి విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి

తాండూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తాండూరు ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల హాస్టల్‌లో అనారోగ్యానికి గురైన విద్యార్థినులకు మెరుగైన అందించాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశించారు. తాండూరు ట్రైబల్ వెల్ఫేర్స్ గర్ల్స్ హాస్టల్ విద్యార్థులు మంగళవారం అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న ఆయన మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో ఎమ్మెల్యే సోదరుడు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నరసింహులు ఆస్పత్రిలో ఉండి స్వయంగా అస్వస్థతకు గురై జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి వారికి దగ్గరుండి వైద్యం అందేలా చూశారు. బుధవారం గురుకుల హాస్టల్‌లో హెల్త్ క్యాంపు నిర్వహించాలని ఆదేశించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఫుడ్ పాయిజన్

తాండూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే తాండూరు ట్రైబల్ వెల్ఫేర్స్ గర్ల్స్ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగిందని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తమైతే బీఆర్‌ఎస్ పార్టీ చూస్తు ఊరుకోదని హెచ్చరించారు. విద్యార్థులు ఆస్పత్రిపాలవడం బాధాకరమన్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

సీఎం సొంత జిల్లాలో విద్యార్థుల అవస్థలు

వికారాబాద్: సీఎం సొంత జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాండూరు గిరిజన బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ ఘటన బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల చూపే కపట ప్రేమకి ఇది నిదర్శనమన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

తాండూరు: తాండూరు గిరిజన బాలికల హాస్టల్ ఫుడ్‌పాయిజన్ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీసీ కమిషన్ రాష్ట్ర మాజీ సభ్యుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శుభప్రద్‌పటేల్ డిమాండ్ చేశారు. ఒక పక్క విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతుంటే మరో పక్క ప్రభుత్వం విజయోత్సవ సంబురాలు చేసుకోవడంపై మండిపడ్డారు.

నిధుల లేమితో నిర్వహణ భారం

- రైతువేదికల్లో కనీస సౌకర్యాలు కరువు
- ఇబ్బందుల నడుమ సమావేశాలు

కొడంగల్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం క్లస్టర్ పరిధిలో రైతు వేదికలను ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. రెండేళ్లుగా వీటి నిర్వహణకు నిధులు రావడం లేదు. కనీస వసతులు లేకపోవడంతో అసౌకర్యాలకు నిలయాలుగా మారుతున్నాయి. సమావేశాలకు వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొడంగల్ మండలంలో ఎనిమిది రైతువేదికలు ఏర్పాటు చేశారు. రావులపల్లి, టేకుల్‌కోడ్, అంగడిరైచూర్, చిట్లపల్లి, రుద్రారం, పర్సాపూర్, ఎరన్‌పల్లి, హస్నాబాద్ క్లస్టర్‌లలో రైతువేదికలు ఉన్నాయి. నూతనంగా దుద్యాల్ మండలం ఏర్పాటుతో హస్నాబాద్ ఆ మండలంలోకి వెళ్లిపోయింది. వ్యవసాయాధికారి, రైతులు కూర్చునేందుకు బల్లలు, కుర్చీలు, సమావేశాల నిర్వహణకు మైక్‌సెట్ వంటి సామగ్రిని ప్రభుత్వం అందించింది. వీటి నిర్వహణకు నెలకు రూ.9వేలు (శిక్షణ ఖర్చులు రూ.3,000, స్టేషనరీ, జిరాక్స్ రూ.1000, విద్యుత్ చార్జీలు రూ.1000, నిర్వహణకు రూ.1000, పరిశుభ్రతకు రూ.3000) ఇస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. 2022 ఏప్రిల్ నుంచి 2022 ఆగస్టు వరకు ఐదు నెలలకు సంబంధించి ఒక్కో రైతువేదికకు రూ.45వేలు అందించింది. ఆ తర్వాత నుంచి నిధులు రావడం లేదు. దీంతో రైతు వేదికల నిర్వహణ భారంగా మారింది. దీనికి తోడు రైతు వేదికల చుట్టూ ప్రహరీ లేకపోవడం అసౌకర్యాలకు నిలయాలుగా మారాయి. నెలల తరబడి నిధులు రాకపోవడంతో రైతువేదిక నిర్వహణ కష్టంగా మారింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఏఈవోలే సొంతడబ్బులు ఖర్చు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిధులు ఎప్పుడు విడుదల చేస్తుందని ఎదురు చుస్తున్నారు.



చిట్లపల్లి క్లస్టర్ రైతు వేదిక

యువతకు క్రీడల్లో ప్రోత్సాహం

పెద్దేముల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ పోటీలతో ప్రభుత్వం గ్రామీణ యువతకు క్రీడల్లో ప్రోత్సాహాన్ని అందిస్తోందని ఎంపీడీవో జర్నప్ప అన్నారు. స్పోర్ట్స్‌అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో పల్లెల నుంచి ప్రపంచ స్థాయి విజేతలకు నిలిపేందుకు సీఎం కప్ క్రీడాపోటీలు జరుగుతున్నాయని చెప్పారు. పెద్దేముల్ మండలం మంబాపూర్, కందనెల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులకు ఉపాధ్యాయులు క్రీడాపోటీలు నిర్వహించారని చెప్పారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి

బషీరాబాద్: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల(బాలురు) మైదానంలో సీఎం కప్-2024 పోటీలను బషీరాబాద్ ఎంపీడీవో విజయ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. మొదటి రోజు వాలీబాల్ పోటీలు జరుగగా ఫిజికల్ డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, గంగయ్య, అంబదాస్, సుజాత నేతృత్వంలో కొనసాగాయి. స్థానిక జీహెచ్‌ఎం షరీఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమ: దోమ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. గెలుపొందిన క్రీడాకారులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్‌బాబు, హెచ్‌ఎం ఆంజనేయులుగౌడ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో సీఎం కప్ క్రీడా పోటీలను పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్నగౌడ్, ఎంఈవో హరిలాల్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ యాదాద్రి పార్కులో ఏర్పాటుచేసిన మున్సిపల్ స్థాయి సీఎం కప్ పోటీలను పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్, మేనేజర్ అంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

కీసర రూరల్: సెరినిటీ పాఠశాల ప్లే గ్రౌండ్‌లో మున్సిపల్ స్థాయిలో నిర్వహించిన సీఎంకప్-2024 క్రీడలను మంగళవారం నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ భాస్కర్‌రెడ్డి, మేనేజర్ చంద్రశేఖర్, మల్లేష్‌యాదవ్, ముప్పు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

శామీర్‌పేట: సీఎం కప్-2024 పోటీలను తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో కబడ్డీ, ఖో-ఖో క్రీడాపోటీలు, సీనియర్లు, జూనియర్ల విభాగంలో అథ్లెటిక్స్ 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపాలిటీ కమిషనర్ వెంకట్ గోపాల్ పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్ష, పోరాటంతోనే తెలంగాణ సాకారం


పరిగి: తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ దీక్ష, పోరాటంతోనే తెలంగాణ సాధించుకున్నామని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం పరిగిలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ పాల్గొన్నారు.

వికారాబాద్: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా విగ్రహాలను మారుస్తూ రాజకీయాలు చేస్తోందని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం మాజీఎమ్మెల్యే మెతుకు ఆనంద్ నివాసంలో బీఆర్‌ఎస్ పిలుపు మేరకు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

మేడ్చల్‌టౌన్: మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాలకు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్ క్షీరాభిషేకం చేశారు.

శామీర్‌పేట: కేటీఆర్ పిలుపు మేరకు బొమ్మరాసిపేటలో సోమవారం తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మధుకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఎల్లూబాయి, అనిత, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

మన్‌సాన్‌పల్లి పంచాయతీ కార్యదర్శిపై చర్యలకు సిఫారసు

పెద్దేముల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మన్‌సాన్‌పల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి సుజిత్‌కుమార్ కొన్నిరోజుల నుంచి విధులకు హాజరు కావడంలేదని గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సుజిత్‌కుమార్‌పై చర్యలకు ఎంపీడీవో సిఫారసు జారీ చేశారు. దుగ్గాపూర్ పంచాయతీ కార్యదర్శికి అదనపు బాధ్యతలు అప్పగించామని చెప్పారు. సుజిత్‌కుమార్‌పై క్రమశిక్షణ చర్యలకు డీపీవోకు నివేదిక అందజేసినట్లు పేర్కొన్నారు.

తిరుపతి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ

- 4.5తులాల బంగారు, 15తులాల వెండి అపహరణ

కీసర రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన మంగళవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల వివరాలిలా ఉన్నాయి. రైల్వేఉద్యోగి అయిన గౌటె సంజీవ నాగారం మున్సిపాలిటీ ఆర్‌ఎల్‌నగర్, గణేష్‌నగర్ రోడ్డు నంబర్4లో నూతనంగా ఓ ఇంటిని కొనుగోలు చేశాడు. 20రోజుల కిందట గృహప్రవేశం చేసి, మేడ్చల్ నుంచి ఇక్కడికి మకాం మార్చాడు. కాగా వేంకటేశ్వస్వామి దర్శనానికని కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 6వ తేదీన తిరుపతి వెళ్లాడు. తీర్థయాత్రలు ముగించుకుని మంగళవారం ఇంటికి చేరుకున్నాడు. గేటుకు వేసిన తాళం వేసినట్టుగానే ఉండగా ఇంటి ప్రధానద్వారం తాళం పగులగొట్టి ఉంది. దీంతో సంజీవ వెంటనే డయల్-100కు సమాచారం అందించాడు. కీసర పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దొంగలు అల్మారాలో దాచిన 4.5తులాల బంగారు, 15తులాల వెండి వస్తువులను ఎత్తుకెళ్లినట్లు పోలీసులతో తెలిపాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ @ 90డేస్

(5వ పేజీ తరువాయి)

వెనకబడి ఉన్నారనేది గుర్తించి మిగతా విద్యార్థులతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక తరగతులు తీసుకోనున్నారు. కళాశాలల్లో సబ్జెక్టుల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి 90 రోజుల పాటు అమలు చేయనున్నారు.

నోడల్ అధికారుల తనిఖీలు

జిల్లాలో మొత్తం 77 జూనియర్ కళాశాలు ఉండగా, వాటిలో 13 ప్రభుత్వ, 10 బీసీ సంక్షేమ, 10 కేజీబీవీ, 9 మోడల్, 6 సాంఘిక సంక్షేమ, 6 గిరిజన సంక్షేమ, 2 టీఎస్ఆర్‌జేసీ, 6 మైనార్టీ గురుకుల, 15 ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 13,178 మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. వీరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,435 మంది విద్యార్థులు, ప్రైవేట్, గురుకుల, కేజీబీవీ, మోడల్ విద్యాలయాల్లో 9,748 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంటర్ విద్యా డైరెక్టర్ ప్రకటించిన ప్రణాళిక మేరకు జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను నోడల్ అధికారి తనిఖీలు నిర్వహిస్తూ 90 రోజుల ప్రణాళిక అమలుపై దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ ప్రణాళిక ప్రకారం కళాశాలల్లో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ఎలాంటి బాధ్యతలు నిర్వహించాలనేది వివరిస్తున్నారు.

కౌన్సెలింగ్‌కు చర్యలు

విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు ప్రతీ కళాశాలలో విద్యార్థినులకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఇద్దరు అధ్యాపకులను కౌన్సెలర్లుగా నియమించనున్నారు. మానసికంగా ఒత్తిడికి గురయ్యే విద్యార్థులకు వారు కౌన్సెలింగ్ నిర్వహించి మానసిక ప్రశాంతత పొందేలా అవగాహన కల్పించనున్నారు. అవసరమైతే సైకాలజిస్టుల సేవలు కూడా తీసుకోనున్నారు.

వీరుపాక్షి సేవలు చిరస్మరణీయం

వికారాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలి విడత ఉద్యమంలో శెట్టి వీరుపాక్షి అందించిన సేవలు చిరస్మరణీయమని ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ ఎ.చంద్రశేఖర్ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన శెట్టి వీరుపాక్షి(72) ఇటీవల అనారోగ్యానికి గురై సోమవారం రాత్రి మృతిచెందారు. మంగళవారం చంద్రశేఖర్ తన కూతురు డాక్టర్ చంద్రప్రియతో కలిసి వీరుపాక్షికి నివాళులర్పించారు. రుద్రభూమిలో జరిగిన వీరుపాక్షి అంత్యక్రియలకు మాజీ మంత్రి డాక్టర్ ఎ.చంద్రశేఖర్, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ నర్సింహులు గుప్తా, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు జి.నాగేందర్‌గౌడ్, గుడిసె లక్ష్మణ్, బైండ్ల విజయకుమార్, వి.సత్యనారాయణ, చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, సుధాకర్ రెడ్డి, లవకుమార్, నరోత్తంరెడ్డి, దత్తు, శేఖర్ తదితరులు హాజరయ్యారు.


వీరుపాక్షి (ఫైల్)


వీరుపాక్షి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్

యువకుడు అదృశ్యం


అంబాజీ సాయి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తల్లి తిట్టిందని ఇంటినుంచి వెళ్లిన కుమారుడు తిరిగిరాలేదు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఈడబ్ల్యుఎస్ కాలనీకి చెందిన అంబాజీ మాధవి కుమారుడు సాయి(20) ఏ పనీచేయకుండా తిరుగుతుంటాడు. ఈనెల 4న మధ్యాహ్నం తల్లి తిట్టిందని సాయి ఇంట్లో నుంచి బయటకువెళ్లి తిరిగిరాలేదు. తల్లి, బంధువులు, మిత్రులను, తెలిసిన వారిని విచారించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం సాయంత్రం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు వాహనాల్లో రేషన్ బియ్యం పట్టుబడినట్లు సీఐ రాజువర్మ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అన్నోజిగూడ తాజా టిఫిన్ సెంటర్ వద్ద మంగళవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా వస్తున్న అశోక్ లైలాండ్ వాహనాన్ని ఆపి సోదా చేయగా అందులో 25క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని గుర్తించినట్లు తెలిపారు. యాదాద్రీ-భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలం, బబ్లానాయ్ తండాకు చెందిన మాలోత్ లక్ష్మన్(32) అన్నోజిగూడ పరిసరప్రాంతాల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ మేరకు వాహనాన్ని సీజ్‌చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా మరో వాహనంలో 45 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుడినట్లు తెలిపారు. యాదాద్రీ-భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం బుక్యా తండాకు చెందిన గుగూలోతు నవీన్‌నాయక్, గుగూలోతు సాగర్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆశా వర్కర్ల ముందస్తు అరెస్టు

వికారాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి ఆశావర్కర్లు హైదరాబాద్‌లో హెల్త్ డైరెక్టరేట్ ముట్టడికి వెళ్లకుండా ముందస్తు అరెస్టులు చేపట్టారు. జిల్లా నుంచి ఆశావర్కర్లు తరలి వెళ్లకుండా మంగళవారం ఉదయం నుంచే ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్లకు తరలించారు. జిల్లా వ్యాప్తంగా 180మంది ఆశ వర్కర్లను అరెస్టు చేయగా సాయంత్రం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

ఆశావర్కర్లపై దాడి హేయం

మేడ్చల్ టౌన్: శాంతియుతంగా మెడికల్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లపై పోలీసుల దాడి హేయమని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శంభు ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపిన ఆశావర్కర్లను అడ్డుకుంటూ పోలీసులు ప్రవర్తించిన తీరును ఆయన తప్పుబట్టారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మేడ్చల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఫణికుమార్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట మంగళవారం సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరాహార దీక్షను చేపట్టారు. ఉద్యోగ సంఘం నేతలతో చర్చలు జరిపి 100 రోజుల్లో సమస్య పరిష్కరస్తామని కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు.

హామీని విస్మరించిన సీఎం

వికారాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో చాయి తాగినంత సమయంలో మీ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి విస్మరించారని టీఎస్ఎస్‌యూఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు కేతావత్ గంగ్యానాయక్ తెలిపారు. వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి అమరుల స్థూపానికి నివాళులర్పించారు. ఈ ప్రభుత్వం సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం లేదని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం, వెంకట్ రెడ్డి, ప్రభావతి, స్వరూప, స్రవంతి, లత, మంగమ్మ, శైలజ, స్రవంతి, రాజేశ్వరి, అనిల్, జంగయ్య, రాఘవేందర్, ప్రమోద్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్‌పై నుంచి జారిపడి మహిళ మృతి

పరిగి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బైక్‌పై నుంచి జారిపడి ఓ మహిళ మృతిచెందింది. ఈఘటన పరిగి పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పరిగి మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన నిదురం లక్ష్మి(38), భర్త రాములు కలిసి సోమవారం వారి స్వగ్రామం నుంచి బైక్‌పై పాలకూర తీసుకొని పరిగికి వస్తున్నారు. నారాయణపూర్ శివారులోని వాగు దాటుతుండగా బైక్‌పై వెనకాల కూర్చున్న లక్ష్మి ప్రమాదవశాత్తు కిందపడింది. దీంతో ఆమె తలకు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో పరిగి అస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలి అన్న బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

మహిళపై హత్యాయత్నం

పూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు ఓ మహిళాపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని మన్నెగూడ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, చెన్‌గోముల్ ఎస్‌ఐ మధుసూదనరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని చంద్రయాన్‌గుట్ట బండ్లగూడ ప్రాంతానికి చెందిన బీబీ ఫాతిమా(42)ను సోమవారం పని ఉందని చెప్పి గుర్తుతెలియని వ్యక్తులు వికారాబాద్‌కు తీసుకువచ్చారు. అనంతరం ఆమె మెడపై కత్తితో దాడి చేసి పారిపోయారు. అనంతరం ఆమె తెల్లవారుజామున మన్నెగూడ చౌరస్తాలోని రాజ్‌హోటల్ సమీపంలో కొనఊపిరితో ఉండటంతో హోటల్ యజమాని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. అనంతరం ఆమెను పోలీసులు 108అంబులెన్స్‌లో వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. అయితే అసలు ఆ మహిళను తీసుకువచ్చిన వారు ఎవరనే వివరాలు తెలియాల్సివుందని ఎస్‌ఐ మధుసూదనరెడ్డి తెలిపారు. ఆమె మెడపై గాయాలైనందున ఆమె మాట్లాడే పరిస్థితుల్లో లేదని చెప్పారు. సీసీ ఫుటేజీను పరిశీలించగా ఆమె వికారాబాద్ నుంచి మన్నెగూడ మార్గంగుండా హోటల్‌కు చేరుకున్నట్లు తెలుస్తుందని ఎస్‌ఐ తెలిపారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

మూడుచింతలపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో పుస్తెలతాడు అపహరించుకెళ్లిన ఘటన శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మూడుచింతలపల్లి గ్రామానికి చెందిన అత్తెల్లి బసవమ్మ రోజూవారి పని నిమిత్తం తన వ్యవసాయ పొలం వద్ద ఆరబోసిన ధాన్యాన్ని నేర్పడానికి వెళ్లింది. ఈ క్రమంలో గుర్తుతెలియని ఇద్దరు దుండగులు యాక్టీవా బైక్‌పై వచ్చి ఆమె మెడలో నుంచి సుమారు నాలుగు తులాల పుస్తెలతాడును లాక్కొని పారిపోయారు. ఈఘటనలో ఆమె ప్రతిఘటించగా పుస్తెలతాడులో కొంతభాగం ఆమె వద్ద మిగిలింది. దీంతో ఆమె కేకలు వేయగా స్థానికులు గమనించి విషయాన్ని పోలీసులకు సమాచారాన్ని అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సూరారం వద్ద బాలిక ఆచూకీ లభ్యం



సఖీ కేంద్రంలో బాలికను అప్పగిస్తున్న కరన్‌కోట్ పోలీసులు

తాండూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలిక ఆచూకీ సూరారం వద్ద లభించింది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కరన్‌కోట్ గ్రామానికి చెందిన బక్క లాలమ్మ మనవరాలు బక్క స్వాతి(9) గతనెల 22వ తేదీన ఉప్పు తీసుకువచ్చేందుకు షాప్‌నకు వెళ్లి కనబడకుండా పోయిన విషయం తెలిసిందే. లాలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా బాలిక తప్పిపోయిన రోజే ఉదయం సుమారు 10గంటల ప్రాంతంలో స్వాతి తనంతట తానే కర్ణాటక నుంచి వచ్చే బస్సుఎక్కి తాండూరు మల్లప్ప మడిగ అనే ప్రాంతంలో దిగినట్లు బస్సు కండక్టర్ ద్వారా సమాచారం అందింది. దీంతో పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి తాండూరు, వికారాబాద్, హైదరాబాద్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, సదాశివ్‌పేట్, కర్ణాటక ప్రాంతంలోని చించోళి, సేడం, వాడీ, గుల్బర్గ ప్రాంతాల్లో బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే సోమవారం రాత్రి 8గంటల ప్రాంతంలో జీడిమెట్లలోని సూరారం పోలీసుస్టేషన్ పరిధిలో బాలిక ఆచూకీ లభించగా, వెంటనే అక్కడికి వెళ్లి బాలికను తీసుకువచ్చి వికారాబాద్‌లోని సఖీ కేంద్రానికి అప్పగించామని ఎస్‌ఐ వివరించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు, రిమాండ్


పోలీసుల అదుపులో నిందితుడు

వికారాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయించేందుకు ప్రయత్నించిన ఓవ్యక్తిని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టుచేసి 200గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గుల్బర్గాకు చెందిన రసూల్ వికారాబాద్ పట్టణంలో, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో గంజాయి అక్రమరవాణా, అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించిన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అతడిపై నిఘా ఉంచారు. వికారాబాద్ పట్టణంలో రసూల్ గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నాడన్న సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రసూల్ వద్ద 200గ్రాముల ఎండు గంజాయి లభించింది. నిందితుడు రసూల్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు డీటీఎఫ్ ఇన్‌చార్జి శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది విష్ణువర్ధన్ రెడ్డి, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ ఆర్టీసీ డిపోలో డ్రగ్స్ స్వాధీనం

మేడ్చల్ టౌన్: డ్రగ్స్ తరలిస్తున్న ఓ వ్యక్తిని నార్కోటిక్ పోలీసులు అరెస్టుచేసి 600గ్రాముల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మంగళవారం మేడ్చల్ ఆర్టీసీ డిపోలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... మేడ్చల్ ఆర్టీసీ డిపోలో ఓవ్యక్తి వద్ద డ్రగ్స్ ఉన్నట్టు నార్కోటిక్ పోలీసులకు మంగళవారం సమాచారం రావటంతో వారు మేడ్చల్ పోలీసులతో కలిసి సదరు వ్యక్తిని అదుపులో తీసుకుని విచారించారు. స్థానిక ఆర్టీసీ కార్గోలో ఈ డ్రగ్స్ పార్సిల్ వచ్చినట్టు తెలిసింది. పార్సిల్‌పై అనుమానం రావటంతో కార్గో సిబ్బంది కార్గో సిబ్బంది అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇవ్వటంతో పార్సిల్ డెలవరీ తీసుకున్న వెంటనే సదరు వ్యక్తిని అదుపులో తీసుకునట్లు సమాచారం. అదుపులో తీసుకున్న వ్యక్తిని విచారిస్తున్నందున పోలీసులు వివరాలు వెల్లడించలేదు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గిర్మాపూర్ గామానికి చెందిన బిర్జేష్‌పాల్(35), సోమవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులకు చెరువు ఒడ్డున బట్టలు, చెప్పులు కనబడటంతో చెరువులో గాలింపు చేపట్టారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కాగా బిర్జేష్ మేడ్చల్ అడ్డాపై రోజు వారి కూలీగా పనిచేస్తున్నాడని, ఉపాధి కోసం మధ్యప్రదేశ్ ఘోరక్‌పూర్ నుంచి వచ్చి గిర్మాపూర్‌లో తన సోదరుడి వద్ద ఉంటున్నాడని స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్షిప్తంగా..

తైక్వాండోలో ఉచిత శిక్షణ

ఘట్‌కేసర్: తైక్వాండోలో మాస్టర్స్ డిగ్రీ శిక్షణ పూర్తి చేసుకున్న గ్యార నరేష్ ప్రభుత్వ పాఠశాల్లో చదువుకునే విద్యార్థులందరికీ ఉచితంగా త్వైకాండో శిక్షణ ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా నరేష్‌ను ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని మంగళవారం సత్కరించారు.

పాంబండ ఆలయ చైర్మన్‌గా మహిపాల్‌రెడ్డి

కులకచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయ కమిటీ చైర్మన్‌గా కోట్ల మహిపాల్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వును మంగళవారం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అందజేశారు. సభ్యులుగా కాశమోని చిన్న నర్సిములు, ఎం.ప్రభాకర్, రాకొండ కలమ్మ, చింతకింది అంజిలయ్య, ఉదయ్‌కిరణ్, కురువ కరై నర్సింహులుతో పాటు ఈవో సుధాకర్, అర్చకులు దశరథ్ సభ్యులుగా ఉంటారు. ఈనెల 15న నూతన పాలక వర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కులకచర్ల: క్రితి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని సాల్వీడ్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఎంఈవో హబీబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై ఫిర్యాదు

కీసర రూరల్: దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడ రాజీవ్ గృహకల్ప కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి మద్యం మత్తులో ఓవ్యక్తి దుశ్చర్యకు పాల్పడ్డాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ సంఘాల నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

బొంరాస్‌పేట్: మండలంలోని రేగడిమైలారం గ్రామానికి చెందిన కోతి వెంకటప్పకు ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.లక్ష సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు అందజేశారు.

దౌల్తాబాద్ పీహెచ్‌సీలో ఉచిత టీబీ పరీక్షలు

దౌల్తాబాద్: పీహెచ్‌సీలో మంగళవారం ఉచిత టీబీ పరీక్షలు నిర్వహించారు. 120 మందికి పరీక్షలు చేయగా అందులో 10 మందికి టీబీ వ్యాధి నిర్ధారణ అయినట్లు జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి రవీందర్‌యాదవ్ తెలిపారు.

కళాశాలలో ఉచిత వైద్య శిబిరం

మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, అధ్యాపకులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీ.వీ. రెడ్డి, డైరెక్టర్ సరోజారెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీలత పాల్గొన్నారు.

జడ్పీ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్

బషీరాబాద్: ఎన్నికలపై ప్రత్యక్షంగా అవగాహన ఉండాలనే ఉద్దేశంతో బషీరాబాద్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల(బాలికలు)లో మంగళవారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల జీహెచ్‌ఎం హీర్యానాయక్, తోటి ఉపాధ్యాయులు ప్రజాస్వామ్య వ్యవస్థలో జరిగే ఎన్నికలను విద్యార్థులకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించి ఎన్నికల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో విజయ్ కుమార్, ఎస్‌ఐ శంకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాణిక్, విజయలక్ష్మి, శ్రావణి, కవిత, లక్ష్మిబాయి, అంజుమ్, స్వరూప, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కొడంగల్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం కొడంగల్ తాలూకా అధ్యక్షుడు మన్నె బస్వరాజ్‌యాదవ్ మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘంనాయకులు చంద్రశేఖర్‌గౌడ్, హన్మయ్య యాదవ్ పాల్గొన్నారు.